



## నడకయాతన

మండల పరిధిలోని కసుకర్రు గ్రామ ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కంకర తేలి, గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణిస్తూ ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి చినుకులకు కూడా గుంతల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. –పొన్నూరు

## క్లుప్తంగా

### మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి



కాకుమాను: విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండల కేంద్రం కాకుమాను ఉర్దూ పాఠశాలను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి పాఠశాలలో పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులతో ఎంఈఓ భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం మహ్మద్ రిహానా, ఉపాధ్యాయులు ఉన్నారు.

### చేబ్రోలులో భారీ వర్షం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈ నెల 1, 2వ తేదీలలో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. పొలాల్లోని నీరు బయటకు పోవటానికి పది రోజులు సమయం పట్టింది. అప్పటి నుంచి కాలువలకు నీరు విడుదల చేయకపోవటంతో మెరక ప్రాంతాల్లోని పొలాలకు సాగునీరు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మాగాణి, మెట్ట, కూరగాయ తోటలు బెట్టకు వచ్చాయి. ప్రస్తుత పరిస్థితిలో కురిసిన వర్షం రైతులకు మేలు చేకూర్చుతుందని రైతులు చెబుతున్నారు. మండల పరిధిలోని వేజండ్ల, శలపాడు, శేకూరు, వీరనాయకునిపాలెం తదితర గ్రామాల్లో భారీ వర్షాలు, వరదలకు పొలాలు పూర్తి దెబ్బతిని నష్టపోయాయి. ప్రస్తుతం అక్కడి రైతులు పొలాలను దమ్ము చేసి, దూర ప్రాంతాల నుంచి వరి నారు కొనుగోలు చేసి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

### పోస్టాఫీస్‌లో కొనసాగుతున్న విచారణ



పొన్నూరు: మండల పరిధిలోని ఆరెమండ తపాలా కార్యాలయంలో అవకతవకలపై ఉన్నతాధికారుల విచారణ కొనసాగుతోంది. పలు గ్రామాల ప్రజలు దాచుకున్న సొమ్ము రూ.లక్షలను బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ స్వాహా చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. అయితే బాధితులకు జరిగిన నష్టంపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నారు. బాపట్ల డివిజన్ పోస్ట్ ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కూడా విచారణ కొనసాగింది. పోస్ట్ ఆఫీస్‌లో జమ చేసిన బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తావని అధికారులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పొన్నూరు: మండల పరిధిలోని వెల్లలూరు గ్రామ ప్రధాన రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో ఇరువురు గాయపడ్డారు. వివరాలు.. పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ ఖాసిం, ఇద్దరు మిత్రులతో ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాసిం అక్కడికక్కడే మృతి చెందిగా, ఇరువురికి గాయాలు కావడంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### ఏఎన్‌యూ ఫైనాన్స్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డికి సన్మానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్ ఆఫీసర్ గా విధులు నిర్వహించిన ఎం.చంద్రశేఖర్ రెడ్డి యూనివర్సిటీ నుంచి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని పరిపాలనా భవన్‌లో సోమవారం చంద్రశేఖరరెడ్డికి సన్మాన సభ నిర్వహించారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం సన్మానించారు. యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా చంద్రశేఖర్ రెడ్డి విలువైన సేవలు అందించారని కొనియాడారు. చంద్రశేఖర్ రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం ఏఎన్‌యూ అకౌంట్స్ విభాగంలో డెప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉన్న ఏ వెంకటేశ్వర్లకు యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

### రేపు బాలు స్వర నీరాజనం

నగరంపాలెం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి పురస్కరించుకుని ఈనెల 25న గానగంధర్వునికి స్వరనీరాజనం నిర్వహించనున్నట్లు కళాదర్బార్ అమరావతి వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నాజ్ కూడలిలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించి, అనంతరం ఉదయం 11 గంటలకు అదే ప్రాంతంలోని హోటల్ అర్చిడ్‌లో బాలు స్వర నీరాజనం సంగీత విభావరి జరుగుతుందని చెప్పారు.

# ఆంధ్ర గ్రామ సంఘంలో అవకతవకలు

- వీవోఏ లక్షల్లో అవినీతికి పాల్పడినట్లు అనుమానాలు
- జిల్లా ఉన్నతాధికారులతో విచారించి నిగ్గు తేల్చండి
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గొట్టిపాడు ఏఏ వీవో ఓబీలు, డ్వాక్రా మహిళలు



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడుతున్న డ్వాక్రా మహిళలు

ప్రత్తిపాడు: ఆది ఆంధ్ర గ్రామ సంఘం లావాదేవీల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని పూర్తిస్థాయి విచారణ జరిపించి న్యాయం చేయాలంటూ గొట్టిపాడు డ్వాక్రా మహిళలు కలెక్టర్ నాగలక్ష్మిని కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ని కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఆదిఆంధ్రా వీవో ఓబీ సభ్యులు, మహిళలు తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులోని ఆంధ్రా గ్రామ సమాఖ్య సంఘం వీవోఏగా ప్రత్తిపాటి మల్లేశ్వరి పదకొండు సంవత్సరాలుగా పనిచేస్తుంది, గ్రామ సంఘానికి చెందిన బ్యాంకు ఖాతా లావాదేవీలన్నీ తానే నిర్వహిస్తోందని చెప్పారు. వీవోలో ఉన్న 24 గ్రూపులకు సంబంధించిన సభ్యత్వ రుసుం 2013 నుంచి 2024 వరకు ప్రతి ఏటా క్రమం తప్పకుండా వీవోఏకి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ మా వీవో బ్యాంకు ఖాతాలో రూ.56 వేలు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారని వాపోయారు. స్త్రీనిధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఒక్కో సభ్యురాలి నుంచి రూ.250 చొప్పున లంచంగా వీవోఏ తీసుకుంటున్నారని, అంతేకాకుండా తీసుకున్న స్త్రీ నిధి రుణం బకాయిలను ప్రతి నెల వీవోఏకు చెల్లిస్తున్నామని, కానీ మేం చెల్లించిన నగదుకు, రుణ మొత్తానికి మధ్య భారీ వ్యత్యాసం వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాల సమయంలోనూ ఒక్కో సభ్యురాలి నుంచి రూ.500 లేదా రూ.600 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే వెలుగు కార్యాలయంలో అప్లికేషన్ ఆన్‌లైన్ చేసినందుకు చెల్లించాలని చెబుతున్నారని వాపోయారు. స్త్రీనిధి రుణం క్లోజ్ చేసే సమయంలో బకాయి ఉన్న వారి నగదును వీవోఏనే చెల్లించి సభ్యురాలికి మరో రుణం మంజూరైన తరువాత వారి వద్ద నుంచి రూ.5 వడ్డీతో సహా డబ్బులు తీసుకుంటుందని ఆరోపించారు.

వీవో తీర్మానం పుస్తకాలు, చెక్ బుక్స్, బ్యాంకు బుక్స్, స్టాంప్‌లు అన్నీ వీవోఏ తన వద్దనే ఉంచుకున్నదని చెప్పారు. గట్టిగా ప్రశ్నించడంతో కొత్త తీర్మానం పుస్తకాలు ఇచ్చిందని, పాతవి ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. తాజాగా మా చేత ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని విజయవాడలో ముంపు ప్రాంతానికి గురైన వరద బాధితుల కోసమని మాకు తెలియకుండా మా వీవో నుంచి రూ.12 వేలు మండల సమాఖ్య ఖాతాకు నగదు బదిలీ చేసిందని, అంతేకాకుండా మరలా సభ్యుల నుంచి కూడా డబ్బులు వసూలు చేసిందని చెప్పారు. గతంలో రావెల కిషోర్‌బాబు మంత్రిగా ఉన్న సమయంలో మా వీవోకు రూ.5 లక్షల నగదును చెక్ రూపంలో ఇచ్చారని, ఆ నగదు ఏమయ్యాయో కూడా తెలియడం లేదని వాపోయారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేయించి న్యాయం చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

# చెత్త నుంచి సంపద సృష్టి

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా



అవగాహన కల్పిస్తున్న షేక్ ఖాజా

ప్రత్తిపాడు: చెత్తను సక్రమంగా వినియోగిస్తే సంపద సృష్టించవచ్చని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా అన్నారు. మండల పరిధిలోని నడింపాలెంలో సోమవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటరుకు ర్యాలీగా తీసుకువెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానం, చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసే పద్ధతి, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఖాజా మాట్లాడుతూ మన చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వలన గ్రామం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని కోరారు. ఇంటి వద్దకు చెత్తబండి వచ్చినప్పుడు తడి పొడి చెత్తలను వేరుచేసి సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి సర్పంచి పాలెపు కుమారి, విద్యాకమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ, ఐటీసీ ఫినిష్ సొసైటీ అసిస్టెంట్ ప్రోగ్రామ్ మేనేజర్ అరుణ, కోఆర్డినేటర్లు ఉమామహేశ్వరి, కోటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం జంపని విజయ్ కుమార్, ఉపాధ్యాయురాలు పద్మరాణి పాల్గొన్నారు.

# ఆర్‌వీఆర్‌జేసీలో జాతీయస్థాయి సదస్సు ప్రారంభం

గుంటూరు రూరల్: ఇంజినీర్లు స్వయం మేధా శక్తితో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరికరాలతో చిరస్థాయిగా నిలిచే నిర్మాణాలను చేపట్టాలని బెంగళూరుకు చెందిన సీనియర్ సివిల్ ఇంజినీర్ నిపుణులు ఉమేష్ బి రావు పేర్కొన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ టెక్నిక్స్ ఫర్ ది రిపేర్ అండ్ స్ట్రెంత్నింగ్ ఆఫ్ కాంక్రీట్ స్ట్రక్చర్స్ అనే అంశంపై ఐదు రోజుల పాటు జాతీయ స్థాయి ఆన్‌లైన్ సెమినార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ పరీక్ష పరికరాల మీదనే పూర్తిగా ఆధారపడకుండా సాంకేతికతను పూర్తిగా అవగాహన చేసుకొని కట్టడాల పటిష్టతను నిర్ధారించాలన్నారు. అద్భుత నిర్మాణాల సృష్టి సివిల్ ఇంజినీర్ల మేధాశక్తేనని, వినూత్న ఆలోచనలతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచే నిర్మాణాలు చేపట్టే దిశగా ఇంజినీర్ల ఆలోచనలు ఉండాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఏ శ్రీనివాస్‌ప్రసాద్, ఎంఎల్ఎస్ కృష్ణసాయి పాల్గొన్నారు.

# పంట నష్ట నమోదు గడువు పొడిగించాలి



నీటమునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు


గరికపాడు(కాకుమాను): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలను కోల్పోయిన ప్రతి రైతుకి నష్ట పరిహారం అందించడంతో పాటు నష్ట నమోదు గడువును పొడిగించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గరికపాడు, పాంద్రపాడు, కొల్లిమర్ల, వల్లూరు, లింగంగుంటపాలెం గ్రామాలలో నీటమునిగిన వరి పంటలను సోమవారం కౌలురైతు సంఘ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని అనేక మంది కౌలు రైతులు ఎంతో నష్టపోయారని తెలిపారు. సోమవారంతో పంటనష్ట నమోదు ముగుస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారని చెప్పారు. భారీ వర్షాలు కురిసి ఇరవై రోజులు అయిన నేటికి పంట పొలాల్లో నీరు నిలబడి ఉందని వివరించారు. పంట నష్ట నమోదును పొడిగించి పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేయాలని కోరారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీన మండల కేంద్రాలలో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్య రైతులు, కౌలు రైతులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు చుక్కా యానాదులు, నల్లమోతు రాజేంద్ర పాల్గొన్నారు.

### వెస్ట్ తహసీల్దారుగా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకారం



గుంటూరు రూరల్: గుంటూరు వెస్ట్ తహసీల్దారుగా కె.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు సీఆర్‌డీఏకు బదిలీపై వెళ్లగా 20 రోజులుగా డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాధారణ బదిలీలలో భాగంగా వెంకటేశ్వరరావు బదిలీపై గుంటూరు వెస్ట్‌కు వచ్చారు. గతంలో ఆయన ప్రకాశం జిల్లా దర్శి తదితర ప్రాంతాల్లో పనిచేస్తూ ఎన్నికల సమయంలో మంగళగిరికి బదిలీపై వచ్చారు. అనంతరం గుంటూరు వెస్ట్ తహసీల్దారుగా ఉన్నతాధికారుల ఉత్తర్వులమేరకు బాధ్యతలు స్వీకరించారు.

### రూరల్ ఎంపీడీఓగా శ్రీనివాసరావు..



గుంటూరు రూరల్: గుంటూరు రూరల్ మండలం ఎంపీడీఓగా బండి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఎంపీడీఓ ఆదినారాయణ బదిలీలలో భాగంగా నెల్లూరుకు బదిలీపై వెళ్లగా, ప్రకాశంజిల్లా ఒంగోలు రూరల్‌లో విధులు నిర్వహిస్తున్న బండి శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రూరల్ మండలంలోని గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు శక్తివంచనలేకుండా కృషి చేస్తానని తెలిపారు.

### నేడు ఉచిత కాలేయ పరీక్ష శిబిరం

గుంటూరు రూరల్: ఉచిత కాలేయ పరీక్ష శిబిరం మంగళవారం నిర్వహించనున్నట్లు శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆస్పత్రి చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారుల్లోని గోరంట్ల గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

# చతుర్విధ ప్రక్రియల్లో నైపుణ్యం పెంచాలి

ఎంఈఓ రమాదేవి



ఓపెన్ స్కూల్ పోస్టర్లును ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: విద్యార్థులు చతుర్విధ ప్రక్రియల్లో నైపుణ్యం పెంపొందించుకునే బోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంఈఓ రమాదేవి మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు హెచ్ఎంలు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. సీఎల్ కోసం స్కూల్ అసిస్టెంట్లు హెచ్ఎం నుంచి, హెచ్ఎంలు ఎంఈఓ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఏ నెల సిలబస్‌ను ఆ నెలలోనే కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని, విద్యార్థులతో వర్క్‌బుక్స్ రాయించాలని స్పష్టం చేశారు. అసెస్‌మెంట్–1 పరీక్షలకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఎంఈవో–2 జి. లీలారాణి మాట్లాడుతూ విద్యార్థులు యూనిఫాం, షూస్‌తో బడికి వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, భద్రత లేని చోట్ల విద్యార్థులను కూర్చోబెట్టవద్దని చెప్పారు. 15 ఏళ్లు పైబడి చదువు మధ్యలోనే ఆపేసిన వారితో ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి చదివేందుకు దరఖాస్తు చేయించాలని లీలారాణి హెచ్ఎంను కోరారు. అదే విధంగా వారంలో నాలుగు రోజులు మరుగుదొడ్ల ఫొటోలు, ఎస్ఎంసీ చైర్మన్‌లతో తీయించాలని సూచించారు.

# చలపతిలో జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పెయింటింగ్, లీప్లెట్, సినిమాటిక్ వీడియో పోటీలను నిర్వహించారు. పోటీలలో నగరంలోని ఇతర ప్రాంతాలకు చెందిన 10 ఫార్మసీ కళాశాలల విద్యార్థులు ఆన్‌లైన్ కాంపిటీషన్‌లో పాల్గొన్నారు. పెయింటింగ్ పోటీలలో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు భాగ్యశ్రీ, రితీష్‌చంద్ర మొదటి బహుమతి సాధించగా, రెండో బహుమతి మలినేని లక్ష్మయ్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు షేక్ అన్వర్‌బాషా, ఎం.శ్రీలక్ష్మి సాధించారు. సినిమాటిక్ వీడియో పోటీలలో చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు జీ వంశీకృష్ణ, ఎల్.తేజస్విని ప్రథమ బహుమతి సాధించగా, మలినేని లక్ష్మయ్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు కె.శ్రావణి, షేక్ కుషియా, పీ సౌమ్య, ఎం.అమూల్య, పీ జ్యోతి సాధించారు. ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సైక్రియాట్రి డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సాయికిరణ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

# విజ్ఞాన్, ఎస్ఈసీ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం



విద్యాసాగర్‌తో పత్రాలను మార్చుకుంటున్న వైస్ చాన్సలర్ నాగభూషణ్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ దొంతినేనితో ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నట్లు ఆయన చెప్పారు. ఒప్పందం వల్ల ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని తెలిపారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామని పేర్కొన్నారు. విద్యాసాగర్ దొంతినేని మాట్లాడుతూ విద్యార్థుల్ని సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాల్లో తర్ఫీదనివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

# అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇస్తున్న అర్జీలను క్షేత్ర స్థాయిలో అధికారులు నేరుగా పరిశీలించి, అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం గత వారం అందిన అర్జీల పరిష్కారాలపై సమీక్ష చేస్తామని, కనుక ప్రతి అర్జీ సమగ్రంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రజల నుంచి 58 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 18, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 11, అకౌంట్స్ విభాగానికి 6, ఉపాసెల్ విభాగానికి 1 చొప్పున వచ్చినట్లు పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులకు ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


**ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి**

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా, కేటాయించిన విధుల్లో నిర్దేశిత సమయపాలన పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలను ఆకస్మిక తనిఖీ చేసి, విభాగాధిపతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, కార్యాలయానికి వివిధ అర్జీలు, ఫిర్యాదులపై వచ్చే ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. సెలవులో ఉన్న ఉద్యోగుల స్థానంలో ఇన్‌చార్జిలను వెంటనే ఏర్పాటు చేయాలని, కార్యాలయ సమయంలో ఉద్యోగుల రాకపోకలకు మూమెంట్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్లను ఆదేశించారు. కోర్ట్ ఫైల్స్ సకాలంలో కౌంటర్స్, వకాల్తాలు దాఖలు చేసేలా సంబంధిత గుమస్తాలు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ మురళి పాల్గొన్నారు.

### 29 నుంచి చిరుధాన్యాల వంటకాలపై శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు చిరుధాన్యాలతో తయారు చేసే వివిధ రకాల వంటకాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరు మండలం, పుట్టడిగుంట దగ్గరలోని కొర్నెపాడు గ్రామంలోని రైతునేస్తం ఫౌండేషన్ ఆవరణలోని రైతు శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతోందన్నారు. వివరాలకు 97053 83666, 95538 25532 సంప్రదించి, తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

### కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు సోమవారం విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పట్టించుకోవాలంటూ ప్లకార్డులు చేతితో పట్టుకుని, మెడలో వేసుకుని పెద్దఎత్తున నినాదాలు చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.